లింగవరంలో పడకేసిన పారిశుద్ధ్యం

- గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడే
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



గ్రామంలో జీపీకే రోడ్డు అనుకుని పేరుకుపోయిన చెత్తా చెదారాలు

గుడివాడరూరల్: మండలంలోని లింగవరం గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలో ఎటుచూసినా చెత్త చెదారాలే కన్పిస్తున్నాయి. గ్రామం మురికి కూపంగా మారినా సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో ఒకటైన లింగవరం గ్రామం గుడివాడ పట్టణాన్ని ఆనుకుని ఉంటుంది. మున్సిపాల్టీలో విలీనం ప్రక్రియలో భాగంగా ఏర్పడిన వివాదం నేపథ్యంలో కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికలు గ్రామంలో నిర్వహించలేదు. కొంతకాలంగా ఎక్కడ సమస్యలు అక్కడే తిష్టవేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తే...

లింగవరం గ్రామంలో చెత్త సేకరణ చేయకపోవడంతో ఏ వీధిలో చూసినా చెత్తే దర్శనమిస్తుంది. గ్రామంలో నిత్యం రైతులు తిరిగే రైతుభరోసా కేంద్రం ఎదురుగానే చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. భరోసా కేంద్రానికి వచ్చే రైతులకు చెత్త వలన వచ్చే దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. లింగవరం మెయిన్‌రోడ్డుకి ఇరువైపులా చెత్త మేట వేయడంతో గ్రామస్తులతో పాటు రోడ్డుపై నిత్యం ప్రయాణించే ఇతర మండలాల్లోని ప్రజలు సైతం దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఎంఎస్ఆర్ కళ్యాణ మండపం, చిన్న వంతెన వద్ద గుట్టలు గుట్టలుగా చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రైతుభరోసా కేంద్రం వద్ద పేరుకుపోయి దుర్గందం వెదజల్లుతున్న చెత్త చెదారాలు

డ్రైనేజీ అస్తవ్యస్తం....

గ్రామంలో అంతర్గత డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలో ఏ వీధి చూసినా మురికి కూపంలా దర్శనమిస్తుంది. ప్రతిరోజు డ్రైనేజీ వ్యవస్థను నిర్వహించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో గ్రామంలో నీటిపారుదల వ్యవస్థ సక్రమంగా ప్రవహించక రోడ్లపై మురికి నీరు దర్శనమిస్తుంది. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో మురుగు నీరు రోడ్లపై ప్రవహించి రోజుల తరబడి నిల్వ ఉండి దోమలు, ఈగలు, క్రిమికీటకాలకు ఆవాసంగా మారుతున్నాయి. ఫలితంగా వ్యాధులు విజృంభిస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని పంచాయతీ అధికారి....

గ్రామానికి ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జి కార్యదర్శే విధులు నిర్వహిస్తుండటంతో పాలన పక్కదారి పట్టింది. కోర్టు వివాదం నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారి పర్యవేక్షణలోనే పంచాయతీ నడుస్తుండటంతో అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రజలకు శాపంలా మారింది. ముఖ్యంగా గ్రామంలోని సమస్యలను పట్టించుకోవాల్సిన పంచాయతీ కార్యదర్శి ఇన్‌చార్జి నెపంతో అందుబాటులో ఉండకపోవడంతో గ్రామంలోని సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ మాదిరిగానే ఉండిపోయాయి.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు



గ్రామంలో సమస్యలు తాడవం చేస్తున్నాయి. ఏ వీధి చూసినా చెత్తతో కన్పిస్తూ దుర్గంధం వెదజల్లుతున్నాయి. చెత్తను తొలగించాలని ఎన్నిసార్లు పంచాయతీ కార్యదర్శికి మొరపెట్టినా పట్టించుకున్న పాపానపోలేదు. పాదయాత్ర చేసి ఉన్నతాధికారులకు తెలిపినా ఫలితం శూన్యం. సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పాలకులు పట్టించుకోవాలి.

-ఎ.రవికిరణ్, సామాజిక వేత్త లింగవరం

అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి



గ్రామంలో చెత్తా చెదారాలు వీధుల్లో పేరుకుపోవడంతో ఎటు చూసినా దుర్గంధం వెదజల్లుతుంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వీధుల్లోని రోడ్లు మురికి కూపాలుగా మారాయి. ఫలితంగా దోమలు, కీటకాలు ఎక్కువ కావడంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. ఉన్నతాధికారులు సమస్యలను పరిష్కరించాలి.

-కె.సాయి సుమన్, గ్రామస్తుడు లింగవరం

క్లుప్తంగా

కాలేజీ హాస్టల్‌ను తనిఖీ చేసిన జడ్జి సుధారాణి



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులోని బీసీ వెల్ఫేర్ కాలేజీ హాస్టల్‌ను గుడివాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏపీ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ వారి ఉత్తర్వుల మేరకు ఆమె హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులకు నీటి సమస్యతో పాటు టాయిలెట్స్ డోర్స్ రిపేర్లపై దాతల సహకారంతో అయినా వెంటనే సమస్య పరిష్కారం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. గుడ్లవల్లేరు ఎస్.ఐ ఎన్.ఎన్.వి.సత్యనారాయణ, హాస్టల్ వార్డెన్ జి.చిరంజీవి, లీగల్ వలంటీర్లు, సిబ్బంది ఉన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు: స్థానిక 11 కేవీ ఐఎంఎఫ్ఎల్ ఫీడర్ మీద ఉన్న విద్యుత్ కొత్త లైన్లు పని చేయనున్నందున విద్యుత్ సరఫరాను ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈ మోహన కృష్ణారావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరద బాధితులకు కిట్‌ల పంపిణీ

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న ప్రజలకు లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. మండలంలోని యాకమూరులో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యాన వరద బాధితులకు గురువారం కిట్‌లు పంపిణీ చేశారు. సుధీర్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో 30 మంది వరద బాధిత కుటుంబాలకు జిల్లా గవర్నర్ శేషగిరి కిట్‌లను పంపిణీ చేశారు. లయన్స్ క్యాబినెట్ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు, క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, క్లబ్ మాజీ గవర్నర్ సుభాష్, ప్రతినిధులు రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, బండి జ్యోతి, ఎండీ ఇస్మాయిల్, నెల్లి రాంబాబు, దినవహి ప్రసాద్, పాగిరి రాము, నేరెళ్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిపై అవగాహన

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో శ్రీ సాయి విద్యానికేతన్‌లో గురువారం యూఎన్‌ఓ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ప్రపంచ శాంతి, సామరస్యంపై లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, క్లబ్ కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు, లయన్స్ ప్రతినిధులు చాపరాల బాలాజీ, జంగం మోహనరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం

గుడివాడటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మర్నీడి బాబ్జి అన్నారు. స్థానిక వడ్డాది చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి మాయమాటలు విని ప్రజలు మోసపోయారని తెలిపారు. ఇచ్చిన హామీలు ఏమీ నెరవేర్చని కూటమి పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మొవ్వా మోహన్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వడ్డాది రాజేష్, నాయకులు వి. సుబ్రహ్మణ్యం, బాణావత్ నాయక్, కె. షణిభూషణ్, వి.శివకృష్ణ, ఎస్. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

27న గంగానమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్టాపన

తోట్లవల్లూరు: వల్లూరుపాలెంలో శ్రీగంగానమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 27న నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం, 11.11 గంటలకు గంగానమ్మతల్లి, పోతురాజుస్వామిల విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం అన్నసమారాధన ఉంటుందని చెప్పారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

స్వచ్ఛ కైకలూరుకు సహకరించాలి

కైకలూరు: స్వచ్ఛ కైకలూరును తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కైకలూరు–ఏలూరు రోడ్‌లో వైఎస్సార్ గ్రీన్ విలేజ్ దగ్గరలో పంచాయతీ రోజువారీ చెత్తను తొలగించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. డంపింగ్ యార్డు లేకపోవడంతో రోడ్డు పక్కన చెత్తను పంచాయతీ సిబ్బంది ఇక్కడ పడేస్తున్నారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ కైకలూరులో చెత్త వేయడానికి డంపింగ్ యార్డు స్థలాన్ని సూచించామన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు బూరుబోయిన శ్రీనివాసరావు, తేరా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచండి



గుడివాడ టౌన్: పట్టణ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచడానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు కోరారు. గురువారం పట్టణంలోని 22, 31 నుంచి 34 వార్డుల సచివాలయాల్లో ఆయన తనిఖీలు చేశారు. అనంతరం పట్టణంలో పలు ప్రాంతాల్లో సంచరించి పరిశుద్ధ్య కార్మికులతో రోడ్ల ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రపర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ గృహాల్లో వాడిన చెత్తను తడి, పొడి చెత్తగా విభజించి పురపాలక సంఘ వాహనాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్స్‌లు లేకపోతే చర్యలు

గుడివాడరూరల్: లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు హెచ్చరించారు. మండలంలోని బొమ్ములూరు ఎంఎన్‌కె రహదారిపై గురువారం సాయంత్రం వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహనాలు నడిపే వాహనదారులను ఆపి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి వ్యక్తికి కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు, కార్లలో ప్రయాణించే వాళ్లు హెల్మెట్‌తో పాటు సీటు బెల్టు ధరించాలని సూచించారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే సహించేది లేదన్నారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలను ఇస్తే వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న అసిసీ కరెస్పాండెంట్ సిస్టర్ రోజీ థామస్

పామర్రు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి స్పోర్ట్స్ పోటీలు స్థానిక అసిసీ హైస్కూల్లో గురువారం ఆసక్తి కరంగా నిర్వహించారు. ఈ పోటీల్లో అన్ని హైస్కూల్ నుంచి సుమారు 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిసీ హైస్కూల్ కరెస్పాండెంట్ సిస్టర్ రోజీ థామస్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని తెలిపారు. అండర్–14 బాలికల 600 మీటర్ల రన్నింగ్‌లో హర్షిత ద్వితీయస్థానం సాధించిందని చెప్పారు. అండర్–14 బాలికల లాంగ్ జంప్ విభాగంగా లిప్సిక ద్వితీయ స్థానం, అండర్–14 హైజంప్‌లో ఎ.నాగక్షరిజ, అండర్–14 షార్ట్ ఫుట్, డిస్కస్‌త్రోలో కె.లక్ష్మీ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిందన్నారు. అండర్ –14 బాలుర విభాగంలో హైజంప్ ప్రథమస్థానం కేవీ ఎస్ కార్తీక్, డిస్కస్ త్రో ద్వితీయ స్థానం కార్తీక్ సాధించాడు. అండర్–17 బాలికల విభాగంలో లాంగ్‌జంప్ జె.షర్మిల ప్రథమ స్థానం, కె.ఆయూషా పాప ద్వితీయ స్థానం సాధించారు. డిస్కస్ త్రోలో వి.బిందు మాధవి ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం ఆయూషా పాప సాధించారు. ట్రిపుల్‌జంప్ షర్మిల ప్రథమ స్థానం, వి.బిందు ద్వితీయ స్థానం సాధించారన్నారు. అండర్–17 బాలుర రన్నింగ్ (800)మీటర్లలో గౌరి శంకర్ ప్రథమ స్థానం, పి.లిఖిత్ ద్వితీయస్థానం పొందారు. వాకింగ్ (5 కిలో మీటర్లు) పోటీల్లో గౌరి శంకర్ ప్రథమ స్థానం, డి.దయాకర్ ద్వితీయస్థానం సాధించారు. హైజంప్‌లో డి.దయాకర్ ప్రథమం, అమర్‌నాథ్ ద్వితీయస్థానం సాధించగా, ట్రిపుల్‌జంప్‌లో గౌరీశంకర్ ప్రథమం, డి.దయాకర్ ద్వితీయస్థానం సాధించారు. డిస్కస్ త్రోలో డి.దయాకర్ ద్వితీయ స్థానం పొందారు. అండర్ –17 షార్ట్‌పుట్‌లో భాను ప్రసాద్ ద్వితీయస్థానం, రేవంత్, గౌతమ్‌లు తృతీయ స్థానం సాధించారని చెప్పారు. విజేతలైన వీరు ఈనెల 25న ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేటలో జరిగే జిల్లా స్థాయి స్పోర్ట్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలైన విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులు మట్టా గ్లాడిసన్‌ను కరెస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం సభ్యులు

గుడివాడ టౌన్: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. విజేతలైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం గురువారం సత్కరించింది. తమ విద్యార్థులు ఎస్. నితీష్ కుమార్, డి. సాయి చరణ్, ఎం. వేణుగోపాలుడు, పి. శ్యామ్ ప్రసాద్, బి. మనోజ్, వి. శ్రీకాంత్, వి. సాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించారన్నారు. వీరిలో ఎస్. నితీష్ కుమార్, డి. సాయి చరణ్‌లు ఈ నెల 26 నుంచి 29 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్ షిప్ పోటీలో పాల్గొంటారన్నారు. ఇంతటి ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, పీడీ వీర్ల గోపి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం ప్రసాద్

పమిడిముక్కల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జగ్గయ్యపేటలో జరిగిన జూనియర్, సీనియర్ విభాగం కబడ్డీ పోటీల్లో తాడంకి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ బాలికల విభాగంలో పిడింట్ల పల్లవి, బోయి వెంకటలక్ష్మి, సీనియర్ బాలుర విభాగంలో బొల్లెద్దు అభినయ్ తేజ్‌లు ఎంపికయ్యారని హెచ్‌ఎం ప్రసాద్ తెలిపారు. అండర్–17 బాలుర, బాలికల పోటీలు అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలోను, అండర్–14 బాలుర, బాలికల పోటీలు బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో నవంబర్ 9,10,11 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. హైస్కూల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీలు రవీంద్రబాబు, రాజులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

విజేతలైన విద్యార్థులకు అభినందనలు



పామర్రులో విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ఇందిరారాణి

పామర్రు: రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పామర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎ. ఇందిరారాణి తెలిపారు. కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్లో విజేతలైన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ కనబర్చారన్నారు. హైస్కూల్‌కు చెందిన ఎండీ నూర్జహాన్, ఆదిశేషు, ఐ. రవి ఎంపిక అయ్యారన్నారు. వీరు త్వరలో గుంటూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు జి. మురళి, ఎం.రవికిషోర్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల ఇబ్బందులు, ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు తెలిపేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జి. రాజేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 9959225464 నంబర్లో సంప్రదించాలని కోరారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక



గుడివాడ టౌన్: యూటీఎఫ్ గుడివాడ మండల నూతన కార్యవర్గ ఎంపిక గురువారం నిర్వహించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎంపికలో మండల అధ్యక్షుడిగా ఎస్ఎమ్ కేఎమ్ బాయాజి, ప్రధాన కార్యదర్శిగా డి. రాజశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా వై. శ్రీనివాసరావు, కోశాధికారిగా జయరాజు, ఉపాధ్యక్షులుగా టీఎస్ఎస్ కపర్ది, మహబూబి, ఆడిట్ కమిటీ సభ్యునిగా వి. రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎస్. లత, ఎ. కోటేశ్వరరావు, ఎం.సుభాని, బి. దుర్గాంబ, బి. నాగబాబు, కేఈ ఎస్ఎన్. మూర్తి, జి. రాములు ఎంపికయ్యారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గుడివాడరూరల్: మండలంలోని దొండపాడు గ్రామంలో పాస్టర్‌గా పని చేస్తున్న కట్టా కొండలరావు ఈ నెల 8వ తేదీ గ్రామం నుంచి గుడివాడ వైపు పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన నిమ్మగడ్డ తమేష్ పాత గొడవలను పురస్కరించుకుని మల్లాయపాలెం ప్రధాన రహదారి వద్దకు రాగానే అడ్డుకుని బండి తాళం లాక్కుని కర్రతో దాడి చేశాడు. తనకు జరిగిన అన్యాయాన్ని గ్రామంలోని పెద్దలకు కొండలరావు తెలుపగా గ్రామంలో న్యాయం జరగకపోవడంతో గురువారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితుడు కొండలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

– జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వెంకటరావు



అధికారులకు సూచనలు చేస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరావు

గుడివాడరూరల్: గృహ నిర్మాణ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వెంకటరావు తెలిపారు. మండలంలోని మల్లాయపాలెంలోని హౌసింగ్ లేఅవుట్‌ను అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో పీడీ గురువారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పరిస్థితులను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చేలా మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలను చేపట్టిన లబ్ధిదారులు 2025 మార్చి 31వ తేదీలోగా నిర్మాణాలు పూర్తి చేస్తే బిల్లులు అన్ని ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ గుమ్మడి రత్నశ్రీ, డీఈ రామోజీనాయక్, గృహ నిర్మాణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతో పోలియో నిర్మూలన



విద్యార్థులతో కలసి అవగాహన కల్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు

గుడివాడరూరల్: పోలియో రహిత సమాజానికి అందరూ సహకరించాలని గుడివాడ రోటరీక్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ అన్నారు. పోలియో నిర్మూలన దినోత్సవం సందర్భంగా సిద్ధాంతం మండల పరిషత్ పాఠశాలలో పోలియో నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో విద్యార్థులు, గ్రామస్తులతో కలసి ర్యాలీ నిర్వహించారు. పోలియో నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పోలియో మహమ్మారి అత్యంత ప్రమాదకరమైందన్నారు. ప్రపంచంలో మనపక్కనున్న పాకిస్తాన్, అఫ్ఘనిస్థాన్ తప్ప అన్ని దేశాల్లోనూ పోలియోను నిర్మూలించారని పేర్కొన్నారు. మన దేశంలోనూ పోలియో మహమ్మారి ప్రబలకుండా అందరూ జాగ్రత్తలు వహించాలని కోరారు. ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధికి సహకరించండి



ముదినేపల్లి రూరల్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు మండలాభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ సుభాని, ఎస్ఐ వీరభద్రరావును మండల బీజేపీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడంతో పాటు మండల స్థాయిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేయాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ, మండలశాఖ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మీ, రైల్వేబోర్డు సభ్యుడు మేలిమి లక్ష్మణరావు, తదితరులున్నారు.

సవరణలు చేసేందుకే గ్రామసభలు



ముదినేపల్లి రూరల్: రీసర్వేలో జరిగిన పొరబాట్ల సవరణకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభాని తెలిపారు. మండలంలోని కొరగుంటపాలెం, దేవపూడి, ప్రొద్దువాక గ్రామాల్లో రీసర్వే గ్రామసభలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే వలన రైతులకు ఎలాంటి సమస్యలు ఏర్పడినా వాటిని గ్రామసభల్లో వచ్చే అర్జీల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

నేటి నుంచి అఖిల భారత పశుగణన

మండవల్లి: 21వ అఖిల భారత పశుగణన అక్టోబర్ 25 నుంచి 2025 ఫిబ్రవరి వరకు నిర్వహిస్తామని మండవల్లి పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ డీవీ వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పశుగణన ప్రతీ 5 సంవత్సరాలకోసారి నిర్వహిస్తారన్నారు. మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని అన్ని పశువుల గణనకు కావాల్సిన సిబ్బంది 26 మంది ఎన్యూమరేటర్లు, 5 గురు సూపర్‌వైజర్లకు తగు శిక్షణనిచ్చి సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలకు పోలీసులు మంచి మిత్రులు

కైకలూరు: పోలీసు సమాజానికి మంచి మిత్రుడిగా సేవలు అందిస్తారని కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ చెప్పారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా వ్యాసరచన, కొవ్వొత్తుల ర్యాలీలు గురువారం నిర్వహించారు. మండవల్లి సెంటర్‌లో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో సీఐ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో గణేష్ నిమజ్జనాల సమయంలో అగిరిపల్లి పోలీసు స్టేషన్‌కు చెందిన గంధం నరేంద్ర అనే కానిస్టేబుల్‌ను మద్యం మత్తులో తలపై కొట్టడంతో చికిత్స పొందుతూ మరణించాడన్నారు. ఇటువంటి వారందరి త్యాగాలు పోలీసుశాఖ మరువబోదన్నారు. కార్యక్రమంలో మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ, ఎస్ఐ రామచంద్రరావు, సురేష్, మహిళా కానిస్టేబుల్స్, గ్రామ ప్రముఖులు హాజరయ్యారు.